**ఎండిన బెండకాయ పంట..** 2





**సమస్యల ప్రయాణ ప్రాంగణం..** 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in




## భారీ వర్షం.. రైతన్న హర్షం

కామారెడ్డి జిల్లాలోని పలుచోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. నిజాంసాగర్ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఏకధాటిగా వర్షం కురిసింది. భారీ వాన పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – **అక్షరటుడే నిజాంసాగర్**





# శుభ ముహూర్తాలకు వేళాయె..

**అక్షరటుడే, నిజామాబాద్:** హిందూ ధర్మంలో అత్యంత పవిత్రంగా భావించే మాసాలలో శ్రావణంఒకటి. ఈ నెలలో రాహుకాలం, దుర్ముహూర్తం, వర్జ్యం వంటి అడ్డంకులు ఎక్కువగా ఉంటాయి. అందుకే ఆధ్యాత్మికంగా ఎన్నో విశేషాలను కలిగి ఉన్న ఈ నెల శుభ ముహూర్తాల సమ్మేళనంగా పేర్కొనబడుతోంది. ఈనెల 25వ తేదీన శ్రావణమాసం ప్రారంభమవుతుంది. ఆ మరుసటి రోజు నుంచి వివాహాది శుభకార్యాలకు అనువైన మంచి ముహూర్తాలు ఉన్నాయి.

### శ్రావణమాసం విశిష్టత..

శ్రావణ మాసం తెలుగు సంవత్సరంలో వచ్చే ఐదో నెల. చంద్రుడు శ్రవణ నక్షత్రంతో సంచరించే సమయంలో వస్తుంది కాబట్టి శ్రావణ మాసం అంటారు. ఈనెల శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రంతో ముడిపడి ఉండడం వల్ల దీనికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉంది. శివుడు, లక్ష్మీదేవి, పార్వతీదేవికి సైతం ఈ మాసం ప్రీతికరమైనది. ఈ నెలలో పూజలు, వ్రతాలు, నోములు చేయడం వల్ల సకల సౌభాగ్యాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. శ్రావణంలో చేపట్టే శుభకార్యాలు సుఖసంతోషాలను, సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని తెచ్చిపెడతాయని ప్రజలు నమ్ముతారు.

### శుభ ముహూర్తాలు ఇవే..

ఈనెల 25వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుంది. 26వ తేదీ వచ్చే నెల 17వ తేదీ వరకు పలు శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఈనెల 26, 30, 31 తేదీలతో పాటు వచ్చేనెల 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీలలో మంచి ముహూర్తాలు ఉండడంతో భారీ ఎత్తున వివాహాది శుభకార్యాలు జరగనున్నాయి.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి



**అక్షరటుడే, కామారెడ్డి :** సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సహకారం అందించాలని కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి అన్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 25 సీసీటీవీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో జీవదాన్ హాస్పిటల్ నుంచి వసుంధర వెంచర్ వరకు రోడ్డుకు ఇరువైపులా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సీసీటీవీ కెమెరాలను వసుంధర వెంచర్ వారి సహకారంతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యాచార నిందితుడిని శిక్షించాలి



**అక్షరటుడే, ఇందూరు:** ఒడిశాలో విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన ఎన్ఎస్‌యూఐ నాయకుడిని ఉరితీయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఒడిశా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు భువనేశ్వర్‌లో 19ఏళ్ల విద్యార్థినిపై అత్యాచారం చేసి పోలీసులకు పట్టుపడ్డాడన్నారు. ఇటువంటి వారిపై చట్టరీత్యా కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు అమృతాచారి, శశి, సాయికుమార్ పాల్గొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకం నీరుగారుతోంది. ఉమ్మడి జిల్లాలో గ్యాస్ వినియోగదారులకు రాయితీ డబ్బుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. గత ఆరు నెలలుగా సబ్సిడీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావడంలేదు. గత ఫిబ్రవరిలో పథకం ప్రారంభం కాగా.. కొన్ని నెలలు సక్రమంగా రాయితీ డబ్బులు వచ్చాయి. కానీ గత ఆరు నెలలుగా రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

# నిలిచిన.. రాయితీ



■ నీరు గారుతున్న మహాలక్ష్మి పథకం ■ నెలలుగా ఖాతాల్లో జమ కాని నగదు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మి పథకం కోసం దరఖాస్తులను స్వీకరించింది. లబ్ధిదారులను ఎంపిక చేసి, రాయితీ సిలిండర్లు అందజేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 4.78 లక్షల కుటుంబాలకు 16.33లక్షల రాయితీ సిలిండర్లు సరఫరా చేసింది. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 2.40లక్షల కుటుంబాలకు 8.43 లక్షల సిలిండర్లు, కామారెడ్డి జిల్లాలో 2.38 లక్షల కుటుంబాలకు 7.90 లక్షల సిలిండర్లు సరఫరా చేసింది. నిజామాబాద్ జిల్లా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.25.41 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 16.05 కోట్లు జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

### అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

మహాలక్ష్మి పథకాన్ని గతేడాది ఫిబ్రవరిలో ప్రారంభించారు. ప్రస్తుతం గృహవసర సిలిండర్ రూ.898 ఉంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.47, రాష్ట్ర ప్రభుత్వం రూ.351 లబ్ధిదారుల ఖాతాల్లో సబ్సిడీ కింద జమ చేయాలి. అయితే పథకం ప్రారంభించిన కొత్తలో బాగానే జమ చేయగా.. ప్రస్తుతం కొందరికి మాత్రమే రాయితీ నగదు జమ అవుతుంది. ఆరు నెలలుగా చాలా మంది లబ్ధిదారులకు రాయితీ రావడం లేదు. దీంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం రాయితీ డబ్బులను జమ చేయాలని కోరుతున్నారు.

### రాయితీ జమ కావడం లేదు



మహాలక్ష్మి పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాం. కానీ రూ.47 మాత్రమే ఖాతాలో జమ అవుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్తే.. ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లమన్నారు. అక్కడికి వెళ్తే సరైన సమాధానం చెప్పడం లేదు.

– **సునంద, వినాయక్ నగర్, నిజామాబాద్**

### సబ్సిడీ గురించి తెలియదు

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి గ్యాస్ సబ్సిడీ ఇస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో రూ. 16.05 కోట్ల సబ్సిడీ నిధులు చెల్లించడం జరిగింది. అయి తే ప్రస్తుతం సబ్సిడీ రావడం లేదన్న విషయం మా దృష్టికి రాలేదు. అది స్థానిక ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు చూసుకుంటారు.

– **మల్లికార్జున్, డీఎస్‌వో కామారెడ్డి**

## విద్యార్థులు ధైర్యంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఉండేలా ఉపాధ్యాయులు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి సూచించారు. పట్టణంలోని పిప్రి రోడ్‌లో వేల్పూర్ సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. రెండు రోజుల క్రితం వసతిగృహంలో ఉంటున్న ఇంటర్ విద్యార్థి గడ్డం సంతోష్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలను ఉపాధ్యాయులు, సిబ్బందిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఉన్నతాధికారులకు సమస్యను తెలిపితే పరిష్కార మార్గాలు తెలియజేస్తారని వివరించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బాలు, గంధం నవీన్, పాన్ శ్రీను, ఉదయ్ గౌడ్, కలిగోట ప్రశాంత్, అధికారులున్నారు.

## అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని సీపీకి ఫిర్యాదు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని నగరంలోని ఓ మహిళ సీపీని ఆశ్రయించింది. రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే సవిత అనే మహిళ సోమవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చింది. ఇదే సమయంలో కార్యాలయంలోకి వెళ్తున్న సీపీ సాయిచైతన్య తన కారును ఆపి మహిళతో మాట్లాడారు. తన భర్త అదనపు కట్నం కోసం నిత్యం తనను వేధిస్తున్నాడని ఆమె వాపోయింది. ఆమె దరఖాస్తును పరిశీలించిన సీపీ తక్షణమే సమస్యను పరిష్కరించాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోను ఆదేశించారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి

**అక్షరటుడే, నిజాంసాగర్:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. మహమ్మద్ నగర్ మండలంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు అనిల్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు శంకర్ పటేల్, జ్ఞానేశ్వర్, ప్రవీణ్ రాజు పాల్గొన్నారు.




కాల్పోల్ తండాలోని పాఠశాలలో చికిత్స పొందుతున్న బాధితులు

## మంచం పట్టిన కాల్పోల్ తండా.. తనిఖీ చేసిన కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** విష జ్వరాలతో మోపాల్ మండలంలోని కాల్పోల్ తండా మంచం పట్టింది. గ్రామంలో పదుల సంఖ్యలో గ్రామస్థులు జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కాగా.. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం గ్రామాన్ని తనిఖీ చేశారు. జ్వర పీడితుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జ్వరాలు ప్రబలేందుకు గల కారణాలను గుర్తిస్తూ.. పరిస్థితి అదుపు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే స్థానికులు వైద్య శిబిరానికి వెళ్లి చికిత్స పొందేలా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియా నియంత్రణాధికారి డాక్టర్ తుకారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మోపాల్ ఎంపీడీవో రాములు, ఎంపీవో కిరణ్ తదితరులున్నారు.




గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్



## భక్తిశ్రద్ధలతో బోనాల సంబురం..

**అక్షరటుడే, ఇందూరు/ఆర్మూర్:** ఉమ్మడి జిల్లాలో బోనాల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నగరంలోని బహుజన కాలనీలో బండ పోచమ్మ బోనాల పండుగను సోమవారం నిర్వహించారు. కాలనీ మహిళలు బోనాలతో ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ నాయకులు రామర్తి గోపి, వేణు రాజ్, పార్థసారథి, రాజేష్, మల్యాల గోవర్ధన్, ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ నాయకులు గంగా, జరినా, రక్ష, కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు మారుతి, లక్ష్మి, అలీ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని ప్రెస్టీజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. అలాగే ఆర్మూర్ పట్టణంలోని స్మైల్స్ ది స్కూల్‌లో సోమవారం బోనాల ఉత్సవాన్ని సంబురంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలను ఊరేగించారు.



నగరంలోని బహుజన కాలనీలో..




ఆర్మూర్‌లో..


అక్షర టుడే Web News E-Paper

**విలేకరులు కావలెను**

అనతి కాలంలోనే మిలియన్ల మంది పాఠకులను సొంతం చేసుకుని.. డిజిటల్ మీడియాలో దూసుకెళ్తున్న అక్షరటుడేలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం ఉండి.. అనుభవజ్ఞులైన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఆర్మూర్, బాల్కొండ, డిచ్‌పల్లి, నందిపేట, కామారెడ్డి, వర్ని, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్‌లకు విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు 9010337369 నంబరును సంప్రదించగలరు

WWW.AKSHARATODAY.IN

## రేషన్ కార్డుల జారీ.. నిరంతర ప్రక్రియ



**అక్షరటుడే, ఇందల్వాయి:** రేషన్ కార్డుల జారీ ప్రక్రియ అనేది నిరంతరాయంగా కొనసాగుతుందని.. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గౌడ సంఘంలో సోమవారం లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈనెల 14న సీఎం రేవంత్ రెడ్డి నూతన కార్డుల పంపిణీని ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో 40లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో నిరుపేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతిఒక్క హామీని నెరవేరుస్తోందని గుర్తు చేశారు. జిల్లాలో 63,500, రూరల్ నియోజకవర్గంలో 16,116 కార్డులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఎస్‌వో భరత్, ఏఎంసీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్, మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే గాంధారి:** గాంధారి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వద్ద లబ్ధిదారులకు సోమవారం రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి తహశీల్దార్ రేణుక చౌహాన్ ముఖ్య అతిథిగా విచ్చేసి 60 మందికి రేషన్ కార్డులను అందించారు. అంతేకాకుండా గండేడ్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో 105 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ సంజీవ్ యాదవ్, సొసైటీ డైరెక్టర్ సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు తూర్పు రాజు, లక్ష్మణ్, సెక్రెటరీ నాగరాజు పాల్గొన్నారు.





# సమస్యల ప్రయాణ ప్రాంగణం..

▸ అధ్వానంగా మారిన కామారెడ్డి బస్టాండ్ ▸ అడుగడుగునా గుంతలతో అవస్థలు ▸ పట్టించుకోని అధికారులు

**పాలకులు మారుతున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి మారడం లేదు. దశాబ్దాలు గడుస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఇప్పటికే టాయిలెట్స్, తాగునీరు, ఇతర సమస్యలు వెక్కిరిస్తున్నాయి. మరోవైపు బస్టాండ్‌లోకి వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలతో తీవ్ర ఇబ్బందులు ఎదరవుతున్నాయి.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

బస్టాండు ప్రాంగణంలో అడుగడుగునా గుంతలు ఏర్పడడం అవస్థలు తప్పడం లేదు. బస్సులు లోపలికి, బయటికి వెళ్లే ఎంట్రెన్స్‌లో భారీగా గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు కుదుపులకు లోనవడంతో అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా వర్షాకాలంలో గుంతల్లో నీళ్లు నిండి కుంటలను తలపిస్తున్నాయి. ఆ నీటిలో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది.

### బస్సులకు రిపేర్లు..

బస్సులు ప్రయాణం ప్రాంగణంలోకి వచ్చి పోయే సమయంలో కుదుపులకు లోనవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా బస్సులు కూడా త్వరగా చెడిపోతున్నాయి. జిల్లా కేంద్రంలో బస్టాండ్ పరిస్థితే ఇలా ఉంటే ఇతర ప్రయాణ ప్రాంగణాల పరిస్థితి ఏమిటని విమర్శలు వస్తున్నాయి. అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

### ప్రతిపాదనలు పంపించాం

ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు ఉన్నది నిజమే. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గతంలో పని చేసిన డీఎం కూడా ప్రభుత్వానికి నివేదించారు. నిధులు లేవని సమాధానం వస్తుంది. సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

**– కరుణశ్రీ, డిపో మేనేజర్**

## 27న గిరిజన గర్జన సభ విజయవంతం చేయాలి



**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలో నిర్వహించనున్న గిరిజన గర్జన సదస్సుకు లంబాడీలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని లబాణా జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన 'హలో గాంధారి.. చలో లబాణా' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం లంబాడీల సమస్యలను పరిష్కరాంచాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం లంబాడీల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 27న గాంధారిలో భారీ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి లాంబాడీలు అధికసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మునావత్ గణేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి బద్రీ నాయక్, యువజన జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ నాయక్, రవి నాయక్, శంకర్ నాయక్, మోహన్ నాయక్, దేవి సింగ్, తదితరులు పాల్గొన్నారు.




# డ్రెయినేజీ పనులకు మోక్షం

**నిర్మాణ పనులు చేపట్టిన అధికారులు**

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో మురికి కాల్వల పరిస్థితి అధ్వానంగా మారాయి. దీనిపై 'పారిశుధ్యం అధ్వానం' పేరుతో 'అక్షరటుడే'లో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోని సీ కన్వెన్షన్ హాల్ వద్ద మురికినీరు రోడ్డుపై పారుతోంది. దీంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులపై 'అక్షరటుడే'లో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ కమిషనర్ స్పందించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ రూ. 1.50 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారం చూపిన 'అక్షరటుడే'కు కృతజ్ఞతలు తెలిపారు.

## బస్సు నడుపుతుండగా ఆర్టీసీ డ్రైవర్‌కు ఫిట్స్..



**అక్షరటుడే, బాన్సువాడ:** ఆర్టీసీ డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చినప్పటికీ చాకచక్యంగా వ్యవహరించనడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన బాన్సువాడలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి నుంచి బాన్సువాడకు బస్టాండ్‌కు రావాల్సి ఉంది. బస్టాండ్‌కు మరికొన్ని అడుగుల దూరంలో డ్రైవర్ ఫిట్స్ వచ్చింది. అయినప్పటీ ఆయన చాకచక్యంగా బస్సును దుకాణాల వైపు మళ్లించడంతో పెనుప్రమాదం తప్పింది. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం కాలేదు. దుకాణాల వద్ద పార్క్ చేసి ఉన్న బైక్‌లు ధ్వంసమయ్యాయి. బస్సులో ఉన్న ప్రయాణికులకు సైతం ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## నడిపల్లి తండాలో ఉచిత ఆరోగ్య శిబిరం



**అక్షరటుడే, ఇందల్వాయి:** డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి తండాలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇందల్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రిస్టినా ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రక్త నమూనాలు సేకరించారు. దోమలతో మలేరియా డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు వస్తాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, మండల ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి జయశ్రీ, ఆరోగ్య పర్యవేక్షకుడు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు వెంకట్ రెడ్డి, సుజాత, శోభ, మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు సునీత, లత, పవర్ విజయ పాల్గొన్నారు.

## వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూరు వీడీసీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఏర్పాట్లపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ.. గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మండపాల నిర్వహకులు పాటించాల్సిన నియమాలు, క్రమశిక్షణ, తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. విగ్రహాల నిమజ్జన సమయంలో డబుల్ డీజే వాహనాలకు అనుమతి లేదని, ఒక్కో ప్రాంతానికి ఒక డీజే మాత్రమే ఉండేలా తీర్మానించారు. డీజే వినియోగానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో వీడీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నవనీత్, నరేష్, కేశప్ప గంగారెడ్డి, బంజావ్, గంగాధర్, గ్రామపెద్దలు, యువకులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.




ఉమ్మడి జిల్లాలో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. చిన్నా..పెద్దా తేడాలేకుండా అందరిపైనా గ్రామసింహాలు దాడి చేస్తున్నాయి. ఇప్పటికే అనేకచోట్ల చిన్నారులు, పెద్దలు వీటి కారణంగా గాయాలపాలై ఆస్పత్రుల పాలయ్యారు. పోతంగల్ మండల కేంద్రంలోనూ కుక్కల బెడద పెరిగిపోయింది. అధికారులు స్పందించి వీటి నుంచి రక్షించాలని కోరుతున్నారు. – అక్షరటుడే, కోటగిరి

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గుత్ప గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న మూడు కుటుంబాలకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన రాస సుశీల, బ్యాగరి రవితేజ, గడ్డం శోభ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారి పరిస్థితిని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లగా ఆయన స్పందించి వారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శశి కుమార్, రవిగౌడ్, భూమేశ్వర్, ప్రసాద్, గంగాధర్ , నరేష్, నవీన్, భూమన్న, రాజన్న, గంగాధర్, సాయి కుమార్, విజయ్ గౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు



**అక్షరటుడే, బాన్సువాడ:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాయకులు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కాసుల బాలరాజు మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్త నుంచి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఖర్గే చేపట్టడం మామూలు విషయం కాదన్నారు. రాహుల్ గాంధీని పీఎంగా చేయడమే లక్ష్యంగా పార్టీని పటిష్ట పరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్, ఎర్వాల కృష్ణారెడ్డి, ఎజాజ్ , ఖాలెక్, నార్ల సురేష్, నార్ల నందకిషోర్, మహమ్మద్ గౌస్, నార్ల ఉదయ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





వర్షా ల్లేక రైతులు అల్లాడుతున్నారు.. నారు పోసుకున్న రైతులు నాట్లు వేసేందుకు వానల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దులంలో ఓ రైతు రెండెకరాల్లో బెండకాయ పంట వేశాడు. కానీ వానలు కురవకపోవడంతో పంట ఎండిపోయింది. దీంతో రైతు లబోదిబోమంటున్నాడు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



## వర్షాల కోసం ప్రత్యేక పూజలు

పిట్లం మండల కేంద్రంలోని చెరువు కట్ట రామలింగేశ్వర ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వానలు కురిపించాలని వేడుకుంటూ సోమవారం పూజలు చేశారు. ఆలయంలోని శివుడికి జలాభిషేకం చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. –అక్షరటుడే, నిజాంసాగర్